సాక్షి
గుంటూరు
సోమవారం । 12 । జూన్ । 2023



చకచకా 'స్మతివనం'

విజయవాడ: స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ స్మృతి వనం పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటిపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ▶ 8 లో



తిరుపతమ్మ ఆలయానికి విరాళం

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ గుడిలోని గోపయ్యస్వామి బంగారు తలపాగా తయారీకి ఎన్ఆర్ఐ సాయికృష్ణ, ఆషాగౌరీ దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందించారు.

అమరేశ్వరుని సన్నిధిలో లేళ్ల అప్పిరెడ్డి



అమరావతి: శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వర స్వామిని ఆదివారం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి దర్శించుకున్నారు. స్వామి, దేవేరులకు ప్రత్యేక పూజలు, కుంకుమపూజలు చేశారు. అర్చకులు వేదాశీర్వచనం అందించారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి మిర్చి క్రయవిక్రయాలు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో సోమవారం నుంచి యథావిధిగా మిర్చి క్రయవిక్రయాలు జరుగుతాయని మార్కెట్ యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారులు, హమాలీల అభ్యర్థన మేరకు మే 13 నుంచి జూన్ 11 వరకు యార్డుకు సెలవులు ప్రకటించినట్టు వివరించారు. నెల రోజుల అనంతరం యార్డులో క్రయవిక్రయాలకు అనుమతిచ్చినట్టు తెలిపారు. మిర్చి రైతులు తమ సరుకును ఆదివారం అర్ధరాత్రి నుంచి మిర్చి యార్డుకు తీసుకువచ్చి అమ్మకాలు చేసుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

ఆర్‌బీకేల ద్వారా నాన్ సబ్సిడీ విత్తనాలు

విత్తన కంపెనీలతో ఏపీ సీడ్స్ ఎంఓయూ

కొరిటిపాడు(గుంటూరు): గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా నాన్ సబ్సిడీ విత్తనాల పంపిణీకి రంగం సిద్ధమైంది. ప్రస్తుతం సబ్సిడీపై కందులు, మినుములు, పెసలు, పచ్చిరొట్ట ఎరువులు తదితరాలను పంపిణీ చేస్తున్నారు. నాన్ సబ్సిడీ విత్తనాలనూ ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. వరి, మిర్చి, పత్తి, మొక్కజొన్న, జొన్నలతోపాటు కూరగాయల విత్తనాలనూ రైతులకు పంపిణీ చేయనుండటం విశేషం. కొన్ని రకాల విత్తనాలకు మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో బ్లాక్‌లో అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బ్రాండెడ్ కంపెనీల విత్తనాలనూ ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే విత్తన కంపెనీలతో ఎంఓయూలు కుదుర్చుకుంటోంది. రైతులు ఆర్‌బీకేల్లోని డిజిటల్ కియోస్కుల ద్వారా ఆర్డర్ పెడితే ఏపీ సీడ్స్ ఆయా కంపెనీల విత్తనాలను సరఫరా చేస్తుంది.

దుర్గమ్మ సన్నిధిలో భక్తజన సందడి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై భక్తుల సందడి అధికంగా ఉంది. వేసవి సెలవులు ముగియడంతో ఆదివారం ఇళ్ల నుంచి కళాశాలలు, కాలేజీలు, యూనివర్సిటీలకు బయలుదేరిన విద్యార్థులు దుర్గమ్మ దర్శనం కోసం ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. ఆది దంపతులకు జరిగిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు పాల్గొనేందుకు ఆసక్తి చూపారు. దీంతో ఉదయం 6 గంటల నుంచి ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయంలోని ఇంజినీరింగ్, పరిపాలనా విభాగం అధికారులు, ఈవో భ్రమరాంబ ఆలయంలో క్యూలైన్లు పర్యవేక్షించారు. దుర్గగుడి ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు, మహామండపం, ఘాట్‌రోడ్డు క్యూలైన్లను పర్యవేక్షించారు. ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనం, రూ.100, రూ.300, రూ. 500 టికెట్లు కొని అమ్మవారిని దర్శించుకున్నారు. మహా నివేదన అనంతరం మధ్యాహ్నం 2.30 గంటల వరకు రద్దీ కొనసాగింది. సాయంత్రం అమ్మవారికి జరిగిన పంచహారతులు, పల్లకీ సేవలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 520.40 అడుగుల వద్ద ఉంది. ఇది 150.0070 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 450 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.50 అడుగుల వద్ద ఉంది. ఇది 34.0048 టీఎంసీలకు సమానం.

ఎన్టీటీపీఎస్ 8వ యూనిట్ గ్రిడ్‌కు అనుసంధానం

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో నూతన 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ ట్రయల్ రన్ విజయవంతమైందని సంస్థ అధికారులు వెల్లడించారు. ఈ నెల 2వ తేదీ ఆయిల్‌తో ట్రయల్‌రన్ ప్రారంభించారు. ఆదివారం థర్మల్ ప్లాంట్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రాజు సమక్షంలో బొగ్గుతో ట్రయల్‌రన్ వేశారు. బొగ్గును బంకర్లలో నింపి బాయిలర్‌లోకి పంపించి తయారైన నీటి ఆవిరితో టర్బైన్‌లు తిరగడంతో విద్యుత్ ఉత్పతి ప్రారంభమైంది. తొలుత 30 మెగావాట్ల నుంచి సాయంత్రం 208 మెగావాట్లకు చేరింది.

బుడిబడి అడుగులు

- నేడు పాఠశాలలు పునఃప్రారంభం
- ఎండల తీవ్రత దృష్ట్యా మరో వారం ఒంటిపూట తరగతులు
- జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: బుడి'బడి' అడుగులకు వేళయింది. వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 1,688 పాఠశాలలు ఉండగా, 3,04,429 మంది విద్యార్థులు ఉన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ముస్తాబైన ప్రభుత్వ పాఠశాలలు సకల వసతులతో సిద్ధమై విద్యార్థులకు సుస్వాగతం పలుకుతున్నాయి. ఎండల తీవ్రత దృష్ట్యా సోమవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు ఒక్కపూటే తరగతులు నిర్వహించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2023–24 విద్యాసంవత్సరంలో ప్రస్తుతం గుంటూరు జిల్లాలోని 1,083 ప్రభుత్వ పాఠశాలల్లో 1,16,430 మంది చదువుతుండగా, 605 ప్రైవేటు పాఠశాలల్లో 1,87,999 మంది చదువుతున్నారు. వీరంతా సోమవారం బడిబాట పట్టనున్నారు.



తరగతిగదిలో బోధన చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

మనబడి నాడు-నేడుతో సరికొత్త సొబగులు

గత ప్రభుత్వ పాలనలో వసతుల లేమితో కునారిల్లిన సర్కారు బడులు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో మనబడి నాడు–నేడు కార్యక్రమంతో సరికొత్త సొబగులు అద్దుకున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 1,183 పాఠశాలలను రూ.283 కోట్ల వ్యయంతో సర్కారు ఆధునీకీకరించింది. ప్రస్తుతం రెండో విడతలో ఒక్క గుంటూరు జిల్లాలోనే రూ.202 కోట్ల వ్యయంతో 563 పాఠశాలలను ఆధునికీకరిస్తోంది. సోమవారం పాఠశాలలు పునః ప్రారంభమైన రోజు నుంచే జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్ల పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లాలోని 17 మండలాల వారీగా 1,083 ప్రభుత్వ పాఠశాలల్లో 1,16,430 మంది విద్యార్థులకు జేవీకే కిట్లు అందనున్నాయి. సోమవారం నుంచే జగనన్న గోరుముద్ద అమలుకూ ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లాలో పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 165 ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా నిర్మించిన 838 తరగతి గదులు అందుబాటులోకి రానున్నాయి.



జగనన్న విద్యాకానుక కిట్లతో విద్యార్థులు (ఫైల్)

గుంటూరు జిల్లాలో ఇలా..	
ప్రభుత్వ పాఠశాలలు	: 1,083
ప్రైవేటు పాఠశాలలు	: 605
విద్యార్థుల సంఖ్య	: 3,04,429
జేవీకే కిట్లు పొందనున్న విద్యార్థులు	: 1,16,430

రాగిజావతోపాటు జగనన్న గోరుముద్ద

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచి విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశాం. అన్ని పాఠశాలల్లో జేవీకే కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాలని హెచ్ఎంలను ఆదేశించాం. ఎండల తీవ్రత దృష్ట్యా ఈనెల 17వ తేదీ వరకు ఉదయం 7.30 నుంచి 11.30 వరకు ఒక్కపూటే తరగతులు ఉంటాయి. ఉదయం 8.30 గంటలకు రాగిజావ అందజేస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు యథావిధిగా జగనన్న గోరుముద్ద అందజేస్తారు. ఒంటిపూట బడుల నిర్వహణపై ప్రభుత్వ ఆదేశాలు పాటించాల్సిందే. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు ఉంటాయి. ఈమేరకు డీవైఈఓలు, ఎంఈఓలు చర్యలు చేపడతారు.

– పి.శైలజ, డీఈఓ, గుంటూరు



కానుకల వేడుక.. కాంతులీనే వేదిక : సుమనోహరంగా ముస్తాబైన సీఎం బహిరంగ సభా వేదిక

కోటి కన్నులతో క్రోసూరు

వరాల రేడు వస్తున్నట్టు చెంతనే ఉన్న కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోందో ఏమో.. ఆనందోత్సాహాలు వెల్లువెత్తుతున్నాయి. మంచి ఘడియ రాబోతున్నట్టు అమరావతి అమరేశ్వరుడి ఢమరుకం లయబద్ధంగా నాదం చేస్తోందో ఏమో.. జగన్నినాదంతో క్రోసూరు మార్మోగుతోంది. కానుక కాంతులేవో విరియనున్నట్టు మోడల్ స్కూల్ చిరునవ్వులు చిందిస్తోందో ఏమో.. క్రోసూరు కోటి కనులతో నిరీక్షిస్తోంది. కొంగొత్త ఆశలతో జననేతకు స్వాగతం.. సుస్వాగతం అంటూ ఆహ్వానగీతం ఆలపిస్తోంది.

- జననేత కోసం నిరీక్షణ
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు సర్వం సిద్ధం
- జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ ప్రారంభం

సాక్షి, నరసరావుపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రోసూరు పర్యటనకు సర్వం సిద్ధమైంది. క్రోసూరు మోడల్ స్కూల్ పరిసరాల్లో సోమవారం అట్టహాసంగా జరగనున్న జగనన్న విద్యాకానుక కిట్ల రాష్ట్రస్థాయి పంపిణీ కార్యక్రమ ప్రారంభోత్సవంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొననున్న విషయం తెలిసిందే. దీనికి అవసరమైన అన్ని ఏర్పాట్లనూ జిల్లా అధికార యంత్రాంగం పూర్తిచేసింది. ఆదివారం క్రోసూరులో ఏర్పాట్లు జరుగుతున్న తీరును రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జేసీ శ్యాంప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో పెదకూరపాడు నియోజకవర్గానికి తొలిసారి వస్తున్నందున సభను విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు విశేషంగా కృషి చేస్తున్నారు. ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సభకు భారీగా ప్రజలు రానున్నందున వారికి ఏ ఇబ్బందీ లేకుండా అన్ని చర్యలూ చేపట్టారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం క్రోసూరులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం చేయనున్నారు. రూ.149 కోట్లతో చేపట్టనున్న అమరావతి–బెల్లంకొండ డబుల్ రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే మాదిపాడు వద్ద కృష్ణానదిపై రూ.60 కోట్లతో చేపట్టనున్న వంతెన నిర్మాణానికీ సీఎం శంకుస్థాపన చేయనున్నారు. 14 ఏళ్లుగా సొంత భవనం లేకుండా ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రూ.7.25 కోట్లతో నిర్మించిన కొత్త భవనాన్ని సీఎం దివ్య హస్తాల మీదుగా ప్రారంభించనున్నారు.

పాఠశాలలకు చేరిన పాఠ్యపుస్తకాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు చేరాయి. ఇండెంట్ ప్రకారం 93 శాతం మేర సరఫరా పూర్తయింది. 2023–24 విద్యాసంవత్సరానికి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 3,607 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 4,18,678 మంది విద్యార్థుల కోసం 30,67,307 పాఠ్య పుస్తకాలు కావాలని అధికారులు ఇండెంట్ పెట్టగా, ఆదివారం సాయంత్రానికి 28,64,329 పాఠ్యపుస్తకాలు పాఠశాలలకు చేరాయి. వీటిని సోమవారం జగనన్న విద్యాకానుక కిట్లతో కలిపి పంపిణీ చేయనున్నారు.



గుంటూరులోని గోదాములో భద్రపర్చిన పాఠ్య పుస్తకాలు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ మృతి

గుంటూరు రూరల్: హైవేలో ఆగిఉన్న లారీని వెనుక నుంచి మరొక లారీ ఢీకొన్న ఘటనలో డ్రైవర్, క్లీనర్ మృతి చెందారు. ఆదివారం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ దుర్ఘటన జరిగింది. ఎస్ఐ రోశయ్య కథనం ప్రకారం టైల్స్ లోడుతో గూడూరుకు వెళ్తున్న లారీ టైర్ పంచర్ కావడంతో ఆదివారం తెల్లవారు జామున పొత్తూరు సమీపంలోని నాయుడుపేట వద్ద ఎన్‌హెచ్ 16లో రోడ్డు పక్కన నిలిపి తనిఖీ చేసుకుంటున్నారు. అదే సమయంలో ఖమ్మం జిల్లా పాల్వంచ నుంచి కాళహస్తికి సర్వీ కర్రల లోడుతో వెళ్తున్న లారీ వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో ఢీకొన్న లారీ క్యాబిన్ నుజ్జునుజ్జు అయింది. అందులోని కర్ణాటక రాష్ట్రం హోస్‌పేటకు చెందిన డ్రైవర్ మహబూబ్‌ఖాన్, క్లీనర్ అజీమ్‌ఖాన్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న నల్లపాడు పోలీసులు లారీ క్యాబిన్‌లో చిక్కుకున్న మృతదేహాలను వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదస్థలంలో లారీలు





మృతి చెందిన డ్రైవర్ మహబూబ్‌ఖాన్, క్లీనర్ అజీమ్‌ఖాన్

అంబేడ్కర్ అందరివాడు

- మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ మోపిదేవి
- ఘనంగా రాజ్యాంగ నిర్మాత విగ్రహావిష్కరణ

నిజాంపట్నం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున చెప్పారు. నిజాంపట్నం మండలం గుర్నాథనగర్ పంచాయతీ అంజనాపురం గ్రామంలో అంబేడ్కర్ యూత్ కమిటీ, సర్పంచ్ తోకల సుకన్య ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు పాల్గొని అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ అట్టడుగు వర్గాలకూ విద్య, ఉపాధి ఫలాలు అందాలని నిత్యం శ్రమించిన ధీరోధాత్తుడు అంబేడ్కర్ అని కొనియాడారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు మాట్లాడుతూ అంబేడ్కర్ వల్లే నేడు అన్ని వర్గాలకూ విద్య, ఉపాధి ఫలాలు అందుతున్నాయని చెప్పారు. అంబేడ్కర్ కొందరివాడు కాదని అందరివాడని పేర్కొన్నారు. విగ్రహ దాత లాలం కోటయ్యను అభినందించారు. తొలుత అంబేడ్కర్ యూత్ కమిటీ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మంత్రి, ఎంపీకి ద్విచక్రవాహనాలతో ఎదురేగి ఘన స్వాగతం పలికారు. అనంతరం రూ.10 లక్షలతో అంజనాపురంలో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనాన్ని మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ప్రారంభించారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

అవుట్‌సోర్సింగ్ అప్రతిష్ట

- నగరపాలక సంస్థలో వారిదే హవా!
- అధికారుల లాగిన్లూ వారి వద్దే..
- జీతాల బిల్లులు చేసేదీ వారే!
- భారీగా పైరవీలకు పాల్పడుతున్న వైనం

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగర పాలక సంస్థలో ఏళ్ల తరబడి తిష్ట వేసిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమదే రాజ్యమన్నట్టు చెలరేగిపోతున్నారు. ప్రతి విభాగంలోనూ వారి హవానే కొనసాగుతోంది. పర్మినెంట్ ఉద్యోగుల కంటే వీరు ప్రాధాన్యం కల కీలక బాధ్యతలు నిర్వహిస్తుండడం గమనార్హం. చివరకు ఉద్యోగుల జీతాల బిల్లు వేసేది కూడా కాంట్రాక్ట్ బేసిక్ ఉద్యోగే అంటే అతిశయోక్తి కాదు. ఏళ్లతరబడి ఒకే సీటులో తిష్టవేసిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రతిపనికీ ఓ రేటు కుదిర్చి అధికారులకు దళారులుగా వ్యవహరిస్తున్నట్టు సమాచారం. అవినీతికి పాల్పడుతూ గతంలో కొందరు పట్టుబడిన సందర్భాలూ ఉన్నాయి. అయినా అధికారుల తీరులో మార్పు లేదు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రాధాన్యం తగ్గలేదు.

అధికారుల లాగిన్‌లు వీరి వద్దే..

ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, హెల్త్, రెవెన్యూ, ఉపాసెల్, పరిపాలన విభాగం ఇలా ప్రతి సెక్షన్‌లో అధికారుల లాగిన్‌లు ఎక్కువ శాతం అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వద్దే ఉంటాయి. కొన్నేళ్ల క్రితం అటెండర్‌గా పనిచేస్తున్న ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి వద్ద ఓ అధికారి లాగిన్ ఉండేది. అతను తన సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగుల ఫైల్స్‌ను ఆమోదించేవాడని, ఇతర ఉద్యోగుల ఫైల్స్‌ను పక్కన పడేసేవాడనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం వేరే అధికారి రావడంతో ప్రస్తుతం ఆ అటెండర్ కుల రాజకీయాలు, పైరవీలు చేస్తున్నాడనే తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికీ ఆ అటెండర్ అదే సెక్షన్‌లో కొనసాగడం గమనార్హం.

జీతాల బిల్లు వేసేదీ..

ఉద్యోగుల జీతాల బిల్లు చేసేది కూడా అవుట్ సోర్సింగ్ ఉద్యోగేనంటే ఆశ్చర్యపోవాల్సిన పనే లేదు. బిల్లు వేసే గుమాస్తాలకు సరైన అవగాహన లేకపోవడంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకే పనులు అప్పగిస్తున్నారు. ఎరియర్స్, పీఆర్సీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, కారుణ్య నియామకాలు, బిల్స్ చేయాలంటే కాంట్రాక్ట్ కింద మాట్లాడుకొని పనులు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



ఈస్ట్:91 నగరపాలక సంస్థ కార్యాలయం

పర్మినెంట్ ఉద్యోగుల అవగాహనలేమే కారణం

నగరపాలక సంస్థలో పనిచేసే పర్మినెంట్ ఉద్యోగులకు ఆ విభాగాలపై పూర్తి పట్టులేదు. సరైన అవగాహన లేదు. ఫలితంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులదే రాజ్యమవుతోంది. వారు ఏళ్లతరబడి పని చేస్తుండడంతో అన్ని పనులపై అవగాహన, పట్టు పెంచుకున్నారు. ఫలితంగా పర్మినెంట్ ఉద్యోగులు వారిపై ఆధారపడక తప్పనిస్థితి. అప్పుడప్పుడు కలెక్టరేట్‌లో ఇద్దరు, ముగ్గురు పర్మినెంట్ ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్నా.. ఫలితం శూన్యం.

కమిషనర్లు చర్యలు చేపట్టినా..

నగరపాలకసంస్థ కమిషనర్లుగా వచ్చిన ఐఏఎస్ అధికారులు కొందరు ఇక్కడ జరుగుతున్న అక్రమాలను గుర్తించారు. కమిషనర్ చాంబర్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పలువురు అధికారులకు దళారులుగా వ్యవహరించడం గమనించి ముగ్గురిని వేరే విభాగాలకు మార్చారు. అయినా పూర్తిస్థాయిలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆగడాలను నియంత్రించలేకపోయారు.

ఇవిగో ఉదాహరణలు

- 2020లో ఏసీబీ అధికారులు నగరపాలక సంస్థ అన్ని విభాగాల్లో ఏక కాలంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సందర్భంలో టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వద్ద రూ.29 వేలకుపైగా దొరికాయి. విచారణ అనంతరం అతడిని విధుల నుంచి తొలగించాలని ఇటీవల జూన్ 3న మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు.
- కొద్ది నెలల క్రితం డేటా ప్రాసెసింగ్ ఆపరేటర్(డీపీఓ)గా పనిచేస్తున్న ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి చెక్కుల పోస్టింగ్‌లో అవకతవకలకు పాల్పడ్డారని, ఆర్ఐలతో, ఓ విభాగాధిపతి సహకారంతో రూ.లక్షల్లో చెక్కుల గోల్‌మాల్ జరిగిందని ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఓ పన్నుదారుడు నేరుగా మేయర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన అధికారులను, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని గట్టిగా మందలించారు. దీంతో ఆ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అర్ధంతరంగా మానేశాడు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై నిఘా పెంచుతాం. అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. వారి వల్ల ఫైనాన్షియల్ లాస్ వస్తే క్రిమినల్ కేసులు పెట్టడానికీ వెనుకాడం.

– పెద్ది రోజా, అదనపు కమిషనర్, నగరపాలక సంస్థ

రాష్ట్ర సంక్షేమం కోసం ప్రార్థనలు చేయండి

హజ్ యాత్రికులకు ప్రజాప్రతినిధుల సూచన

పెదకాకాని: రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం హజ్ యాత్రికులు ప్రార్థనలు చేయాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా చెప్పారు. పెదకాకాని మండలం నంబూరు మదరసా ప్రాంగణంలో శనివారం రాత్రి హజ్ కమిటీ ఏర్పాటు చేసిన సమావేశంలో హజ్ యాత్రికులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో విజయవాడ నుంచి తొలిసారిగా ముస్లింలు హజ్ యాత్ర చేసే భాగ్యం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హజ్‌కు వెళ్లే యాత్రికుల కోసం పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసిందని ప్రశంసించారు. కార్యక్రమంలో హజ్ కమిటీ సభ్యులు మన్సూర్ అహమ్మద్, బాసిత్ , ఇమ్రాన్, ఇబదుల్లా పాల్గొన్నారు.



హజ్‌యాత్రికుల బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు వెలంపల్లి, విష్ణు, పార్టీ నేత దేవినేని అవినాష్

హజ్‌యాత్ర ఆనందగా సాగాలి:

హజ్‌యాత్ర ఆనందంగా సాగాలని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ చెప్పారు. నంబూరు మదరసాలో హజ్ యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన బస ప్రాంతం నుంచి ఆదివారం ఉదయం 170 మంది భక్తులు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో హజ్ యాత్రకు తరలి వెళ్ళారు. వెలంపల్లి శ్రీనివాస్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ నాయకుడు దేవినేని అవినాష్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ముందుగా హజ్ యాత్రికులకు స్వీట్లు అందజేసి అభినందనలు తెలిపారు.

శివాలయం ప్రతిష్టకు భంగం కలిగిస్తే చర్యలు

ఆలయ ఏసీ శ్రీనివాసరెడ్డి


మాట్లాడుతున్న ఏసీ శ్రీనివాసరెడ్డి, అర్చకులు

పెదకాకాని: శివాలయం పేరు ప్రతిష్టలకు భంగం కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. నాలుగు రోజులుగా ఆలయంపై అసత్యప్రచారాలు వాట్సాప్‌లు, ఫేస్‌బుక్‌లలో చేర్చడంపై భక్తులకు, ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు ఆదివారం శివాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది క్యాంటిన్‌ను హెచ్చు పాటదారుడు బహిరంగ వేలం ద్వారా పాడుకున్నాడు. ఈనెల 4వ తేదీన ఆలయంలో క్యాంటిన్ ప్రారంభోత్సవం సందర్భంగా గతంలో క్యాంటిన్ నిర్వహించిన షరీఫ్ రావడం జరిగింది. ఆలయ క్యాంటిన్‌లో చికెన్‌తో పట్టుబడిన షరీఫ్ రావడంపై కొందరు ఫొటోలు, వీడియోలు తీసి అన్యమతస్తులు అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. విషయం తెలియగానే మరోసారి షరీఫ్ క్యాంటిన్‌కు వస్తే పాట రద్దు చేస్తామని క్యాంటిన్ నిర్వాహకుడికి నోటీసు ఇవ్వడం జరిగిందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగిపై పదే పదే అగౌరవంగా, అసభ్యంగా మాట్లాడటం మంచిదికాదని హితవు పలికారు. ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకుడు లక్ష్మీనారాణ వరప్రసాద్‌శర్మ మాట్లాడుతూ భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రచారం చేయడం తగదన్నారు. స్వామివారికి భక్తులు తీసుకు వచ్చిన బంతిపూలే ఉపయోగించమని, రోడ్లపై పడిన బంతిపూలు అలంకరిస్తున్నారని ప్రచారం చేస్తున్న వారిని దేవుడు కూడా క్షమించడన్నారు. యాగశాలపై కూడా అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఆగమ సలహాదారుల సలహా మేరకే హోమాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.

జాతీయ పవర్‌లిఫ్టింగ్‌లో జ్ఞానదివ్య కొత్త రికార్డు


సాధించిన పతకాలతో నాగం జ్ఞానదివ్య

తెనాలి: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తెనాలికి చెందిన నాగం జ్ఞానదివ్య తిరుగులేని విజయాలను సాధిస్తోంది. కొత్త రికార్డు నెలకొల్పింది. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరుగుతున్న జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో శనివారం సాయంత్రం జ్ఞానదివ్య ప్రతిభ చూపింది. సబ్‌జూనియర్స్‌లో 84 ప్లస్ కిలోల కేటగిరిలో తలపడిన జ్ఞానదివ్య, స్క్వాడ్‌లో 157.5 కిలోల బరువులనెత్తి రికార్డు సృష్టించింది. బెంచ్ ప్రెస్‌లో 60 కిలోలు, డెడ్‌లిఫ్ట్‌లో 150 కిలోల బరువులనెత్తి సత్తా చాటింది. స్క్వాడ్‌లో, బెంచ్‌ప్రెస్, ఓవరాల్‌లో మూడింటిలోనూ మూడు బంగారు పతకాలు, డెడ్‌లిఫ్ట్‌లో రజత పతకాన్ని సాధించింది. అంతేకాకుండా స్క్వాడ్‌లో రికార్డుతో పాటు ఓవరాల్‌లో గతంలో ఉన్న 365 కిలోల బరువుల రికార్డును బద్దలు కొట్టి, 367.5 కిలోలతో కొత్త రికార్డును నెలకొల్పటం విశేషం. తెనాలి రూరల్ మండలం కొలవరం గ్రామానికి చెందిన నాగం జ్ఞానదివ్య గ్రామంలోని మాతృశ్రీ అకాడమీలో కోచ్ కొల్లిపర నాగశిరీష నేతృత్వంలో పవర్ లిఫ్టింగ్ సాధన చేస్తోంది. గత నెలారంభంలో కేరళలో నిర్వహించిన ఆసియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లోనూ జ్ఞానదివ్య రజత పతకాలతో మెరిసిన విషయం తెలిసిందే.

చకచకా అంబేడ్కర్ స్మృతి వనం పనులు

- రాష్ట్రానికే తలమానికంగా అంబేడ్కర్ విగ్రహం
- 18.18 ఎకరాల్లో రూ.248 కోట్లతో సాగుతున్న పనులు
- తాజాగా రూ.106 కోట్లకు అనుమతులు మంజూరు
- రేయింబవళ్లూ పని చేస్తున్న కార్మికులు
- పనులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్న మున్సిపల్‌శాఖ స్పెషల్ సీఎస్, వీఎంసీ కమిషనర్
- జూలై 15 నాటికి పనులను పూర్తి చేసే విధంగా చర్యలు


అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులు


అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: నగరంలోని స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ స్మృతి వనం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ అద్భుత ప్రాజెక్టు పనులను ఓ మహాయజ్ఞంలా నిర్వహిస్తున్నారు. 125 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహం నిర్మాణం పూర్తిచేసుకుని రాష్ట్రానికే తలమానికంగా నిలవనుంది. 18.18 ఎకరాల్లో రూ.220 కోట్లతో స్మృతి వనం, అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే 74 అడుగుల ఎత్తు వరకు అంటే ఉదర భాగం వరకు విగ్రహ నిర్మాణం పూర్తయింది. ఇప్పటి వరకు దాదాపు రూ.120 కోట్లకు పైగా పనులు పూర్తయ్యాయి. ఈ పనులే కాకుండా అంబేడ్కర్ జ్ఞాపకాలను గుర్తు చేసుకొనేందుకు వీలుగా మ్యూజియం, పూర్తి ప్రహరీ, మరికొన్ని అదనపు పనుల కోసం ప్రభుత్వం తాజాగా రూ.106 కోట్లకు అనుమతి నిచ్చింది. వందలాది మంది కార్మికులు భారీ యంత్రాలతో రాత్రింబవళ్లూ పనులను కొనసాగిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించి పనులను సమీక్షిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. దీంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జూలై 15వ తేదీ నాటికి పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఉన్నతాధికారుల స్వీయ పర్యవేక్షణ

మంత్రుల సబ్ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ అంబేడ్కర్ స్మృతి వనం, విగ్రహ నిర్మాణపు పనులను పరిశీలిస్తోంది. మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి ఈ ప్రాజెక్టు పనులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ ప్రాజెక్టుపై నిత్యం సమీక్ష నిర్వహిస్తున్నారు. వారంలో మూడు నాలుగు సార్లు పనులను పరిశీలిస్తున్నారు. రాత్రి సమయాల్లో సైతం పనులను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు, అధికారులకు దిశానిర్దేశం చేస్తూ పనుల్లో వేగం పెంచుతున్నారు. ఈ భారీ ప్రాజెక్టు పనులను విజయవాడ నగర పాలక సంస్థ (వీఎంసీ) కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. రాత్రి వేళల్లో సైతం అధికారులతో కలిసి పనులను పరిశీలించి విగ్రహానికి సంబంధించిన డిజైన్లలో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కార్మికుల భద్రతకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

పనులు నిర్వహణ ఇలా..

స్వరాజ్య మైదానంలో ఎంతో అద్భుతంగా 125 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఢిల్లీ నుంచి వచ్చిన స్మృతి నిర్మాణం డిజైన్ల ఆధారంగా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనుల్లో వేగం పెంచారు. సీలింగ్, ప్లాస్టరింగ్ పనుల్లో జాప్యం లేకుండా చేస్తున్నారు. పనుల నాణ్యతా ప్రమాణాలను క్వాలిటీ కంట్రోల్ అధికారుల కనుసన్నల్లో పరిశీలిస్తున్నారు. గ్రానైట్ ఫుట్‌పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ నిర్మాణపు తుది దశకు చేరుకుంటున్నాయి. పార్కింగ్ ఏరియా ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాంగణంలో అందమైన రకరకాల పూలు, ఆకర్షణీయమైన మొక్కలతో గ్రీనరీ ఏర్పాటు చేయనున్నారు.

తెనాలిలో 43.2 మిల్లీమీటర్ల వర్షం

సగటున 10.6 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా తెనాలి మండలంలో 43.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా తాడికొండ మండలంలో 2.4 మి.మీ. వర్షం పడింది. సగటున 10.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మేడికొండూరు మండలంలో 40.2 మి.మీ., ఫిరంగిపురం 28.2, చేబ్రోలు 22, గుంటూరు తూర్పు 13.4, వట్టిచెరుకూరు 11.8, పెదకాకాని 10.8, ప్రత్తిపాడు 6.2, కాకుమాను 4, పెదనందిపాడు 3.2, గుంటూరు పశ్చిమ 2.8, తుళ్ళూరు మండలంలో 2.8 మి.మీ. చొప్పున వర్షం పడింది.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

గురజాల: రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురజాల మండలంలోని చర్లగుడిపాడు గ్రామానికి చెందిన పల్లెపోగు సెల్వరాజు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. రాత్రి సత్యనారాయణపురం కిరాయికి వెళ్తూ అదే గ్రామానికి చెందిన కొత్తపల్లి సందీప్‌ను వెంట తీసుకెళ్లాడు. ఆటో కిరాయి అనంతరం తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో గురజాలలోని వన్స్‌మోర్ సూపర్ మార్కెట్ సమీపంలో సెల్వరాజు ఆటో అదుపుతప్పి రోడ్డు మార్జిన్ పక్కన ఉన్న గోడకు తగిలి పక్కనే పార్కింగ్ చేసిన కారును ఆటో ఢీకొట్టింది. సెల్వరాజ్ తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక సీట్లో కూర్చున్న కొత్తపల్లి సందీప్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కొత్తపల్లి సందీప్ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐలు అశోక్‌కుమార్, బి.అనంత కృష్ణ పరిశీలించారు.

వడ్డెరలను గుర్తించిన ఏకైక సీఎం వైఎస్ జగన్

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గడచిన ఏడున్నర దశాబ్దాల కాలంలో వడ్డెర సామాజిక వర్గానికి చట్టసభల్లో తమ వాణిని వినిపించే అవకాశం రాలేదని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం అన్నారు. రాష్ట్రంలో 25 లక్షల పై చిలుకు జనాభా కలిగిన వడ్డెర్లను గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారన్నారు. తమ జాతిని గుర్తించిన వైఎస్ జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విజయవాడలోని ఐలాపురం కన్వెన్షన్‌లో ఆదివారం వడ్డెర, వడ్డే, వడియ రాజుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ నవరత్న పథకాల ద్వారా వడ్డెర్లకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. అందరికంటే వడ్డెర్లకే ఎక్కువ పథకాలు అందుతున్నాయని చెప్పారు. తమ జాతి గతంలో ఎస్టీ జాబితాలో ఉండేదని, ప్రస్తుతం బీసీ జాబితాలో ఉందన్నారు. వడ్డెర్లను తిరిగి ఎస్టీ జాబితాలో చేర్చే అంశాన్ని శాసనమండలిలో ప్రస్తావిస్తానని తెలిపారు. వడ్డెర సామాజిక వర్గం ఎన్నో సమస్యలను ఎదుర్కొంటుందని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. భవిష్యత్‌లో తమ సామాజిక వర్గానికి మరింత ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రస్తుత ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలోని గనుల శాఖ ద్వారా తమ జాతికి లభించే ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలను గుర్తించి అవన్నీ వారికి లభించేలా కృషి చేస్తానన్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు తన్నీరు ధర్మరాజు, రాజు శరాబందిరాజు, బత్తుల రామారావు, శివరాత్రి కోటేశ్వరరావు, గండికోట సీతయ్య, తురకా లవకుమార్, బత్తుల వెంకటరమణ పాల్గొన్నారు.

డాక్టర్ ఉమ్మారెడ్డి సంకల్ప సిద్ధి ఎంతో గొప్పది

- ఈ వయసులోనూ ఒక మహా యజ్ఞానికి శ్రీకారం
- కొండుభొట్లపాలెం నూతన ఆలయమే ఇందుకు ఉదాహరణ
- రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు
- ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజల్లో మంత్రి రాంబాబు పక్కన ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి

బాపట్ల అర్బన్: ఒక మహా యజ్ఞానికి శ్రీకారం చుట్టిన డాక్టర్ ఉమ్మారెడ్డి సంకల్ప సిద్ధి ఎంతో గొప్పదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. 90 ఏళ్ల వయసులోనూ చెక్కు చెదరని ఆయన ఆశయ సాధనలో ఒక అందమైన ఆలయం ఆవిష్కృతమైందని మంత్రి కితాబిచ్చారు. బాపట్ల మండలం కొండుభొట్లపాలెంలో నూతన ఆలయ సముదాయాన్ని మంత్రి సందర్శించారు. శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తన సొంత ఊరికి ఉపకారిగా చరిత్రలో నిలిచిపోయేలా ఆధునాతన ఆలయాలు నిర్మించి గ్రామానికి అంకితం చేశారని మంత్రి అంబటి కొనియాడారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వివేకా సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు అంబటి మురళి, సీనియర్ న్యాయవాది కళ్లం హరినాథరెడ్డి, బాపట్ల అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ జిలాని, ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబును శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు సత్కరించారు.

వ్యర్థాల నిర్వహణకు సాంకేతికత అవసరం

మంత్రి విడదల రజిని


ప్లాంట్ ప్రారంభ సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట టౌన్: సురక్షిత విధానంతో వ్యర్థాలను వేరు చేయటానికి, భవిష్యత్‌లో డంపింగ్ యార్డులో చెత్త నిల్వలు పేరుకుపోకుండా నూతన సాంకేతిక పద్ధతిలో ఏర్పాటు చేయనున్న ప్లాంట్ ఉపయోగపడుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణానికి సమీపంలోని మానుకొండవారిపాలెం డంపింగ్ యార్డులో సుమారు రూ.13 కోట్లతో గుంటూరుకు చెందిన తరణి అసోసియేట్స్ ద్వారా ఏర్పాటు చేసిన బయో రిమిడియేషన్, బయో మైనింగ్ ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఇందుకు అనుగుణంగానే పట్టణం నుంచి సేకరించే వ్యర్థాలను వేరుచేసే పద్ధతి ఈ ప్లాంట్ ద్వారా సులభతరం అవుతుందని వివరించారు. నానాటికి డంపింగ్ యార్డులో వ్యర్థాల నిల్వలు పెరిగి పోతున్నాయని, వీటిని వేరు చేసి ఆదాయాన్ని ఆర్జించే దిశగా ఈ ప్లాంట్ ద్వారా అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్లాంట్ ద్వారా వ్యర్థాలను తడి, పొడి, ప్రమాదకర చెత్తగా సులువుగా వేరు చేసే అవకాశం ఉందని చెప్పారు. వాటి ద్వారా వచ్చిన మట్టిని, రాళ్లను లోతట్టు ప్రాంతాల్లో పూరించటానికి ఉపయోగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ తోట వెంకటరమణ, తరణి అసోసియేట్స్ ఎండీ డి.శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్ బీఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రాధాన్యం

ప్రభుత్వ విప్ పీఆర్కే


బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.20 లక్షల నగదు అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి

మాచర్ల: బ్రాహ్మణుల సంక్షేమానికి తగిన ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంజూరైన రూ.20లక్షల గ్రాంట్‌ను బ్రాహ్మణ సంఘ పెద్దలకు పీఆర్కే దంపతులు ఆదివారం రాత్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ మాచర్ల పట్టణంలోని 25 సెంట్ల స్థలంలో హైవే పక్కన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించినట్లు వెల్లడించారు. సొంత నిధులు, వివిధ గ్రాంటుల ద్వారా ఇప్పటికే రూ.36 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మరో రూ.15లక్షలతో ప్రహరీ నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కమ్యూనిటీ హాలుతో పాటు వివిధ దేవాలయాల అభివృద్ధి, శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధికి, బ్రాహ్మణులకు ఒకే చోట 70 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించటం జరిగిందన్నారు. మరో 17 మందికి మూడు రోజుల్లో ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలందించనున్నట్లు ప్రకటించారు. ఇంకా పేద బ్రాహ్మణులుంటే స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. మంజూరైన ప్రతి ఒక్కరికీ రూ.2లక్షల ప్రభుత్వ రుణం మంజూరు చేయటం జరిగిందని, పేద బ్రాహ్మణులకు ప్రతి ఒక్కరికీ 50 కట్టల సిమెంట్ అందజేస్తానన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి బ్రాహ్మణుడు ఇళ్ల నిర్మాణం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షులు శ్రీనివాసశర్మ, అధ్యక్షులు దండెంరాజు హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి ఎస్‌వీఎస్ నాగరాజు, బ్రాహ్మణ సంఘ పెద్దలు బత్తిన శ్రీనివాసశర్మ, లక్ష్మీ ప్రసాదరావు, ఎంవీ శ్రీనివాసరావు, డాక్టర్లు కమలాసనరావు, జయప్రకాష్, చిన్న డాక్టర్, న్యాయవాదులు యండ్లపల్లి శ్రీహరి, కృష్ణమూర్తి, కిడ్స్ పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ శాస్త్రి, మారేడుపల్లి లక్ష్మీనారాయణ, జి.అనంత రాములు, ఎంబీ శ్రీనివాసరావు, కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షులు నల్ల వెంకటరెడ్డి, బ్రాహ్మణ సంఘం నాయకుడు చెన్నయ్య పాల్గొన్నారు.

రెచ్చిపోయిన మాజీ రౌడీషీటర్

- పోలీస్ ఔట్‌పోస్ట్ దగ్గర కత్తితో హల్‌చల్
- అన్నయ్య కొడుకుపై దాడి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కేఎల్ రావు కాలనీలో నివాసముండే ఓ మాజీ రౌడీషీటర్ కత్తితో ఆదివారం పోలీసుల సాక్షిగా వీరంగం వేసి, కొడుకు వరసయ్యే వ్యక్తిపై దాడికి పాల్పడ్డాడు. సేకరించిన వివరాలు.. కేఎల్‌రావు కాలనీలో నివాసముండే సైకం మల్లేశ్వరరావు గతంలో ఓ మర్డర్ కేసు, కొట్లాట ఘటనల్లో తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు కావడంతో తాడేపల్లి పోలీసులు అతడిపై రౌడీషీట్ ఓపెన్ చేశారు. ఆరు నెలల క్రితం మల్లేశ్వరరావుపై ఉన్న రౌడీషీట్‌ను తొలగించారు. అయితే మల్లేశ్వరరావును ఎగువ కృష్ణానది ప్రాంతంలోని మత్స్యకార సొసైటీ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. దిగువ ప్రాంతంలో ఉన్న సొసైటీ కూడా తన ఆధీనంలోని రావాలని ప్రయత్నాలు చేసే క్రమంలో మత్స్యకారుల మధ్య విభేదాలు నడుస్తున్నాయి. సైకం మల్లేశ్వరరావు అన్నయ్య కొడుకు సైకం యాకోబు రెండో వర్గానికి అనుకూలంగా ఉన్నాడని భావించి ఆదివారం మధ్యాహ్నం సమయంలో యాకోబు ఇంటికి వచ్చి మనవాడివై ఉండి వాళ్లకి మద్దతు పలుకుతావా అంటూ గొడవకు దిగాడు. యాకోబు ఎవరి వైపు న్యాయం ఉంటే వారివైపు ఉంటానని చెప్పడంతో తనతో తెచ్చుకున్న కత్తి తీసుకుని మల్లేశ్వరరావు వీరంగం వేశాడు. సమీపంలో పోలీసులు ఉన్నప్పటికీ అటువైపు కన్నెత్తి చూడలేదు. దీంతో మరింత రెచ్చిపోయిన మల్లేశ్వరరావు, యాకోబును పొడిచేందుకు ప్రయత్నించగా తప్పించుకునే ప్రయత్నంలో మల్లేశ్వరరావు చేతిలో ఉన్న కత్తి యాకోబుకు చేతికి తగిలి తీవ్ర గాయమైంది. సైకం మల్లేశ్వరరావుపై ఫిర్యాదు చేసేందుకు యాకోబు ప్రయత్నిస్తుండగా వారి బంధువులు అడ్డుకుని కేసు పెట్టనీయకుండా ప్రైవేటు హాస్పిటల్‌లో వైద్యం చేయించారు. సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు ఘటనపై విచారణ చేసి యాకోబు దగ్గర ఫిర్యాదు తీసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ రౌడీషీటర్లపై పోలీసుల సరిగా నిఘా పెట్టకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని పలువురు చెబుతున్నారు.

స్థల వివాదంలో ఘర్షణ.. ఒకరి మృతి


మృతుడు వెంకటేశ్వర్లు

ఫిరంగిపురం: ఇంటి స్థలం వివాదంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణలో ఒకరు మృతి చెందిన ఘటన నుదురుపాడులో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రామారావు, నాగేశ్వరరావు సోదరులు. కొంత కాలం ఇళ్ల స్థలం విషయంలో వివాదం ఉంది. రాత్రి సమయంలో స్థలం విషయంలో ఘర్షణకు దిగారు. రామారావు కుమారుడు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు కుమారుడు శ్రీకాంత్ ఒకరిపై ఒకరు దాడికి దిగారు. శ్రీకాంత్, నాగేశ్వరరావు ఐరన్ పైపుతో రామారావు, వెంకటేశ్వర్లును కొట్టడంతో వెంకటేశ్వర్లు(30) అక్కడికక్కడే మృతి చెందాడు. రామారావు తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న మేడికొండూరు సీఐ వాసు, ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.